

సంగారెడ్డి దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి

గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్

జహీరాబాద్, అక్టోబర్ 27: న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పూల్‌సింగ్‌నాయక్ అన్నారు. ఆదివారం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో అస్వస్థతకు గురై దగ్గు, శ్వాసకోశ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎవరూ అధైర్యపడొద్దని, త్వరగా కోలుకోవాలని మనోధైర్యం కల్పించారు. విద్యార్థులను మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. మూడు రోజులుగా అస్వస్థతకు గురై సంగారెడ్డి దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్, జిల్లా మంత్రి, ప్రజాప్రతినిధులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోకపోవడం బాధాకరమన్నారు. గిరిజనుల పట్ల వివక్ష చూపితే సహించబోమని హెచ్చరించారు. వారివెంట నాయకులు దినేశ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

నిలకడగా గురుకుల విద్యార్థినుల ఆరోగ్యం

జహీరాబాద్, అక్టోబర్ 27: తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ, ఆయాసంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సంబంధిత జిల్లా, మండల అధికారులు తెలిపారు. స్థానిక పాఠశాలకు చెందిన విద్యార్థినుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖాను తరలించారు. దవాఖానలో విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వైద్యాధికారులు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ఒకరిద్దరు మినహా మిగిలిన విద్యార్థినులు కోలుకుంటున్నారన్నారు. కొందరు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థినులు దగ్గు, శ్వాస కోశ సమస్యలతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు బయపడాల్సిన అవసరం లేదని వైద్యాధికారులు, సంబంధిత జిల్లా, మండల అధికారులు సూచించారు.

కార్మికులకు అండగా సీఐటీయూ

గుమ్మడిదల, అక్టోబర్ 27: మండలంలోని దోమడుగు పారిశ్రామిక వాడలోని న్యూ లాండ్ పరిశ్రమ కార్మికులు చారిత్రాత్మక వేతన ఒప్పందం అభినందన సభను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సభకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు చుక్క రాములు హాజరై మాట్లాడుతూ న్యూ లాండ్ పరిశ్రమలో చారిత్రాత్మకమైన వేతన ఒప్పందం కార్మికుల ఐక్యతతో సాధ్యమైందన్నారు. తక్కువ సమయంలో వేతన ఒప్పందం పూర్తి చేయడం హర్షించదగిన విషయమన్నారు. రూ.14 వేలు, ఇతర అనేక సౌకర్యాలు వేతన ఒప్పందంలో సాధించినట్లు తెలిపారు. వీడీఏ పెంచడం, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు, అనేక కొత్త సౌకర్యాలు సాధించినట్లు తెలిపారు. సీఐటీయూ ఉన్న చోట కార్మికులకు అనేక సౌకర్యాలు సాధించి పెడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్, నాయకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

పోలీసులకు వ్యాసరచన పోటీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీసులు

సంగారెడ్డి, అక్టోబర్ 27: పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని పోలీసు జిల్లా కార్యాలయంలో పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి 'సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన వ్యాసాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఎస్పీ చెప్పారు. పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి ఏక్తా దివస్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి 31వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం, తెలంగాణను 'డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన వ్యాసాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులను అవమానపర్చడం బాధాకరం

హత్నూర, అక్టోబర్ 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను అవమానపర్చడం బాధాకరమని ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం కేవలం ఒక డీఏ మాత్రమే చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన ఐదు డీఏలకుగాను వెంటనే మూడు డీఏలు అయినా చెల్లించి అండగా నిలవాలన్నారు. డీఏ అనేది అదనపు జీతం కాదని పెరుగుతున్న ధరలకు అనుగునంగా పెంచుతున్న భత్యము మాత్రమే అన్నారు. డీఏ విడుదల చేయకపోవడంవల్ల నిజవేతనం తగ్గిపోయి కొనుగోలుశక్తి తగ్గుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు కనీసం మూడు డీఏలైనా విడుదలచేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులను పరామర్శించిన మంత్రి, ఎమ్మెల్యే

సంగారెడ్డి, అక్టోబర్ 27: అస్వస్థతకు గురై సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులను ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వేర్వేరుగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు దవాఖానలోని అన్ని విభాగాలను మంత్రి దామోదర పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని వైద్యసిబ్బందికి మంత్రి ఆదేశించారు. వైద్యులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, గిరిజన విద్యార్థి సంఘ అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, శ్రావణ్‌రెడ్డి, చింటు ఉన్నారు.

సంగారెడ్డి దవాఖానలో విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

తాత్కాలిక మరమ్మతులతోనే సరి

- ప్రమాదాలకు నిలయంగా కోహీర్ ప్రధాన రహదారి
- కంకరతేలిన రోడ్డుపై ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- బీఆర్ఎస్ హయాంలోనే రూ.22 లక్షలు మంజూరు
- సైడ్ డ్రైన్ నిర్మించి రోడ్డు నిర్మాణం మరిచిన అధికారులు

కోహీర్ పట్టణంలోని ప్రధాన రహదారి దుస్థితి

కోహీర్, అక్టోబర్ 27: కోహీర్ పట్టణంలోని ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతలు, తాత్కాలిక మరమ్మతులతో తేలిన కంకరతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరు చేసింది. రోడ్డు పక్కన కాల్వల నిర్మాణానికి రూ.15 లక్షలు, సీసీ రోడ్డుకు రూ.8 లక్షలు కేటాయించింది. దీంతో పట్టణంలోని డీసీసీబీ బ్యాంకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా మార్చాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించింది. తద్వారా సంబంధిత అధికారులు ముందుగా రోడ్డుకు ఇరువైపులా నీటి తరలింపు కోసం కాల్వలను నిర్మించారు. కానీ, సీసీ రోడ్డు వేయడం మాత్రం మరిచిపోయారు.

తాత్కాలిక మరమ్మతులకే పరిమితమా?

కోహీర్ పట్టణంలోని ప్రధాన రహదారి కావడంతో కవేలి, దిగ్వాల్, బిలాల్‌పూర్, వెంకటాపూర్, మనియార్‌పల్లి, పైడిగుమ్మల్, చింతల్‌ఘాట్., కొత్తూర్(డి) గ్రామాల వాహనదారులు అవస్థలను ఎదుర్కొంటున్నారు. రెండు నెలల క్రితం గుంతలు పూడ్చి ఇబ్బందుల నుంచి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. కానీ, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. గుంతలమయంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్థానికంగా లేకపోవడంతో ఇంతవరకు పనులు పూర్తి కాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డును నిర్మించి వాహనదారుల ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారిని ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

రోడ్డు ఖరాబైంది.. సీసీ రోడ్డు నిర్మించాలి

నేను చేనుకు పోవాలన్నా, దుకాణాలకు వెళ్లాలన్నా కచ్చితంగా ఈ రోడ్డుపై నుంచి వెళ్తాను. రోడ్డు చాలా ఖరాబ్ అయ్యింది. గుంతలు, గుంతలుగా తయారైంది. గుంతల్లో పడడంతో ఎంతో మందికి దెబ్బలు తగిలాయి. అధికారులు గుర్తించి వెంటనే రోడ్డును మంచిగ చేయాలి. వాహనదారుల కష్టాలను తీర్చాలి

– యాదుల్, వాహనదారుడు, కోహీర్

షార్ట్ సర్క్యూట్‌తో వైన్‌షాప్ దగ్ధం

జహీరాబాద్, అక్టోబర్ 27: నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మొగుడంపల్లి గ్రామంలోని ఓ మద్యం దుకాణంలో ప్రమాదవశాత్తు కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా షాపులో మంటలు చెలరేగాయి. నిమిషాల్లోనే మంటలు వ్యాపించి దుకాణం అగ్నికి ఆహుతైంది. స్థానికులు, ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని రేణుక ఎల్లమ్మ పేరుతో నడుస్తున్న మద్యం దుకాణంలో ఉదయం ప్రమాదవశాత్తు కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలోని మద్యం సీసాలతోపాటు ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించినప్పట్టికీ పూర్తిగా కాలిపోయింది. ఘటనా స్థలాన్ని జహీరాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, అగ్నిమాపక అధికారులు సందర్శించారు. మద్యం దుకాణ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొగుడంపల్లిలో షాట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మద్యం దుకాణం

తుఫాన్ బోల్తా.. పలువురికి గాయాలు

కల్హేర్, అక్టోబర్ 27: జాతీయ రహదారిపై బైక్‌ను ఓవర్‌టేక్ చేయబోయి తుఫాన్ వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకుపోయి బోల్తా పడిన ఘటనలో ఇద్దరూ చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం బాచేపల్లి శివారులో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర దెగ్లూర్ నుంచి తుఫాన్ 21 మందిని తీసుకొని హైదరాబాద్‌కు బయలు దేరింది. నిజాంపేట్ మండలం బాచేపల్లి శివారులోని రాధాస్వామి సత్సంగ్ ఆశ్రమం సమీపంలో 161 నంబర్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో వడ్‌గావ్‌కు చెందిన దీపాలి(12), బాలాలి గ్రామానికి చెందిన సాయి(9)కి తీవ్ర గాయాయ్యాయి. జాతీయ రహదారి అంబులెన్స్‌లో ఇద్దరు చిన్నారులతోపాటూ మరో ఇద్దరిని సంగారెడ్డి దవాఖానకు తరలించారు. స్వల్ప గాయాలైన మరో 11 మందిని నారాయణఖేడ్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎనిమిది మందిని కామారెడ్డి జిల్లా పిట్లం తరలించిగా మెరుగైన చికిత్స కోసం బాన్సువాడకు తరలించారు. ఘటనా స్థలానికి కల్హేర్ ఎస్ఐ వెంకటేశం వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించారు.

ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పత్తి పంటలో గంజాయి సాగు

వట్‌పల్లి, అక్టోబర్ 27: మండలంలోని నిర్జప్ల గ్రామంలో ఆదివారం జోగిపేట ఎక్సైజ్ అధికారులు నమ్మదగిన సమాచారంతో దాడులు నిర్వహించారు. అందోల్ ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వట్‌పల్లి మండలంలోని నిర్జప్ల గ్రామానికి చెందిన కమ్మరి చంద్రయ్య, పెద్దగొల్ల మొగులయ్య అంతరపంటగా గంజాయి సాగు చేస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. పత్తి పంటలో 36 గంజాయి మొక్కలను గుర్తించి ధ్వంసం చేశారు. వాటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు విజయ్, సందీప్, సిబ్బంది ముఖీమ్, విక్రమ్, సాయిలు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న అధికారులు

బాధిత కుటుంబానికి పరామర్శ.. నివాళి

సంగారెడ్డి, అక్టోబర్ 27: చిద్రుప్ప మాజీ సర్పంచ్ తాళ్ల నర్సింహగౌడ్ తల్లి దశ దినకర్మకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరయ్యారు. వీరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేదల ఇళ్లను కూల్చొద్దు



బొల్లారంలో పేదల ఇండ్లను కూల్చొద్దంటూ దీక్ష చేస్తున్న నాయకులు, ప్రజలు

బొల్లారం, అక్టోబర్ 27: ఇటీవల హైడ్రా అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన ఇళ్లకు మార్కింగ్ చేయడంతో తమ ఇండ్లను కూల్చివేస్తారేమోనని ఆందోళన చెందుతూ కొత్త బస్టాండ్ ప్రాంగణంలో స్థానిక పేదలు ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. పేద ప్రజలకు మద్దతుగా మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ దీక్షలో కూర్చున్నారు. దీక్ష శిబిరాన్ని రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి సందర్శించి పేదలకు భరోసా కల్పించారు. ఈ మేరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్‌తో ఫోన్లో మాట్లాడించారు. మంత్రులతో చర్చించి పేదలకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తానని ఆయన భరోసా ఇవ్వడంతో స్థానిక నాయకులు వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపాలమ్మ, నాయకులు అబ్దుల్ బషీర్ పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

కోహీర్, అక్టోబర్27: మండలంలోని దిగ్వాల్ గ్రామంలో పునర్నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ గర్భగుడిలో దుర్గాదేవి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం లభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, తదితర పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా అందంగా అలంకరించిన బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల శోభాయాత్ర కొనసాగింది. అలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వ్యాపారవేత్త మల్లికార్జున్‌గౌడ్ తమ కుటుంబం తరపున లక్ష రూపాయల వ్యయంతో తయారు చేసిన బంగారు నగలను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

తల్లిదండ్రుల సేవయే కర్తవ్యం

తల్లిదండ్రులకు సేవ చేస్తే పరమాత్ముని కృపను పొందవచ్చని మెదక్ జిల్లా రంగంపేట మాధవానంద సరస్వతీ పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రవచనాలను బోధించారు. తల్లిదండ్రులతోపాటు విద్య నేర్పిన గురువు, కష్టకాలంలో తమకు సహాయ పడిన వ్యక్తులకు జీవితంలో ఎన్నడూ మరిచిపోవద్దని సూచించారు. నీరు, భూమి, ఆకాశం, అగ్నిని దేవుడిగా పూజిస్తున్న భక్తులు తోటి మనుషులను మాత్రం సరిగా చూడడం లేదన్నారు. శివనామస్మరణే ముక్తికి మార్గమన్నారు. వేడుకల్లో మాజీ సర్పంచ్‌లు విఠల్‌రెడ్డి, జ్యోతీరామలింగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మంజులా శ్రీనివాస్‌గౌడ్, బక్కారెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, సతీశ్‌గౌడ్, వైద్యనాథ్, నాగరాజు, రమేశ్ గౌడ్, కిష్టయ్య, అంజయ్యగౌడ్, నారాయణ, వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

టైలర్స్ యూనియన్ ఆర్థిక చేయూత

కోహడ, అక్టోబర్ 27: కోహెడ టైలర్స్ యూనియన్ సభ్యులు, కోశాధికారి తుమ్మ రాజు తల్లి సత్తవ్వ అకాలమరణం చెందారు. విషయం తెలిసిన టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం వారి కుటుంబానికి రూ.50 కిలోల బియ్యం, 15 కిలోల నూనె అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి భోగ ఆంజనేయులు, కార్యదర్శి మెరుగు కనకరాజు, పోలవేని వెంకట్, సంగ మహేశ్, పోగుల భాస్కర్, ఆరెపల్లి వెంకన్న, కొత్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రవచనాలు బోధిస్తున్న మాధవానంద సరస్వతి

ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి

గుమ్మడిదల, అక్టోబర్ 27: ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి కలుగుతుందని తోగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కృష్ణానంద ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారి పాదుకలకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే కార్తికమాసంలో ప్రతి ఒక్కరూ శివకేశవుల ఆరాధన చేయాలని సూచించారు. ఆలయాలను సందర్శించి దైవదర్శనం చేసుకోవాలన్నారు. దైవారాధన చేయడం వల్ల మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. మండల పరిధితో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, రామాలయాలు, రామలింగేశ్వరాలయాలు, బగళాముఖీ అమ్మవారి ఆలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలు ఉన్నాయని, కార్తికమాసంలో దర్శించుకోవడంతోపాటు కార్తిక దీపాలను వెలిగిస్తే ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలుగుతాయని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం ఊరేగింపు

హత్నూరలో భక్తిశ్రద్ధలతో ధ్వజ స్తంభాన్ని ఊరేగిస్తున్న భక్తులు

హత్నూర, అక్టోబర్ 27: మండల కేంద్రమైన హత్నూరలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ ఆలయం వద్ద ప్రతిష్ఠంచనున్న ధ్వజస్తంభం ఆదివారం గ్రామానికి చేరుకోవడంతో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ధ్వజస్థంభాన్ని భజన సంకీర్తనల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించగా అడుగడుగునా ప్రజలు హారతిపట్టారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

కోహెడ, అక్టోబర్ 27: సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని గుండారెడ్డిపల్లి పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామ బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ఆర్థిక సహకారంతో రూ.50 వేల విలువగల కంప్యూటర్, ప్రింటర్‌ను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఎంఈవో పద్మయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరిస్తే విద్యార్థులకు మెరుగైన వసతులు సమకూరుతాయన్నారు. ఏఏపీసీ చైర్మన్ లాస్య, తాజామాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కనకయ్య, కోటేశ్వర్, రాజిరెడ్డి, హెచ్ఎమ్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వేరో ధర్మం వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తుంది

బెజ్జంకి, అక్టోబర్ 27: స్వేరో ధర్మం వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తున్నదని మహాసభ కన్వీనర్ బొర్ర సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం స్వేరోస్ జాతీయ మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో స్వేరోస్ సభ్యులు సొలొమోన్, నల్ల బాబు, మామిడాల ప్రవీణ్, బలుగురి దుర్గయ్య, వీరయ్య, ప్రకాశ్, మారుతి, బాబు, ప్రభాకర్, స్వామి, ప్రవీణ్ ఉన్నారు.

ఆ ఇల్లు.. కొలువుల కోవెల

- కుంటుంబ సభ్యులంతా ప్రభుత్వ ఉద్యోగులే..
- ముగ్గురు టీచర్లు.. ఇద్దరు కార్యదర్శులు
- తండ్రి పోస్టల్ శాఖలో చిరు ఉద్యోగి

రాయికోడ్, అక్టోబర్ 27: ఇంట్లో ఒక ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే ఎంతో గొప్ప.. అలాంటిది ఇంటిల్లిపాదికి సర్కారి కొలువులొస్తే.. ఆ ఆలోచనే ఎంతో గొప్పగా ఉంది కదూ.. అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండల కేంద్రానికి చెందిన పులిర్గమ రాఘవరెడ్డి కుటుంబ సభ్యులంతా ప్రభుత్వ ఉద్యోగులే.. దీంతో ఆ కుంటుంబం గ్రామానికే ఆదర్శంగా నిలుస్తూ శభాష్ అనిపించుకుంటున్నది.

నలుగురు ఆడపిల్లలైనా కుంగిపోలేదు..

రాయికోడ్‌కు చెందిన పులిర్గమ రాఘవరెడ్డి, శోభమ్మలకు ఐదుగురు సంతానం. నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు. రాఘవరెడ్డి స్థానికంగా ఉన్న పోస్టల్ శాఖలో ఏబీపీఎంగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. నలుగురు కూతుళ్లు పుట్టారని రాఘవరెడ్డి బాధ పడలేదు.. తను నమ్ముకున్న పోస్టల్ ఉద్యోగంతోనే తన ఐదుగురు పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే పదో తరగతి వరకు చదివించారు. పై చదువులకు సంగారెడ్డి, హైదరాబాద్‌కు పంపారు. చదువుకున్న ప్రాధాన్యతను వివరిస్తూ వెన్నదన్నుగా నిలిచారు. ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే వరకు తన వంతు కృషి చేశారు.

నలుగురు కూతుళ్లు, కొడుకుతో పులిర్గమ రాఘవరెడ్డి, శోభమ్మ దంపతులు

చిరుద్యోగమైనా చింతించలేదు..

రాఘవరెడ్డి మొదటి కూతురు కవిత(2012 డీఎస్‌సీ) మూసాపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలు. రెండో కూతురు కల్పన(2024 డీఎస్‌సీ) ఎంపీపీఎస్ ఝరాసంగం పాఠశాలలో తెలుగు పండిత్, మూడో కూతురు వీరమణి(2024 డీఎస్‌సీ) జిల్లా పరిషత్